సాక్షి
వికారాబాద్
శుక్రవారం । 14 । జూలై । 2023



గడపగడపకు..

ఆరోగ్య రథాన్ని గడప గడపకు తీసుకెళ్లి వైద్యం అందిస్తామని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి తెలిపారు. 8లో▸



పవిత్రోత్సవాలు ప్రారంభం

కొడంగల్‌లోని మహాలక్ష్మీసమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. 8లో▸



ఎన్నాళ్లీ అవస్థలు?

వికారాబాద్‌లోని రైల్వే గేట్ల వద్ద ఓవర్ బ్రిడ్జి లేకపోవడంతో ప్రయాణికులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

పాఠశాల అభివృద్ధికి రూ.5 లక్షల నిధులు



ఎస్‌ఎంసీ సభ్యులకు ప్రొసీడింగ్ కాపీ అందజేస్తున్న మహేందర్‌రెడ్డి

తాండూరు టౌన్: తాండూరు ప్రజలకు తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని విజయవిద్యాలయ ఎయిడెడ్ పాఠశాల అభివృద్ధి కోసం ఎమ్మెల్సీ నిధుల నుంచి రూ.5 లక్షల ప్రొసీడింగ్ కాపీని స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీకి అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీవీహెచ్‌ఎస్ పాఠశాలకు ఘనమైన చరిత్ర ఉందన్నారు. ఇక్కడ చదివిన వారిలో ఎంతో మంది ఉద్యోగులుగా, వ్యాపారులుగా అన్ని రంగాల్లో ఉన్నత స్థానంలో కొనసాగుతున్నారని తెలిపారు. తాను నియోజకవర్గ ప్రజలకు 30 ఏళ్లుగా సేవ చేస్తున్నానని, ఎలాంటి ఇబ్బంది ఉన్నా నేరుగా తనను సంప్రదిస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కరణం పురుషోత్తంరావు, అబ్దుల్ రవూఫ్, వడ్డే శ్రీనివాస్, సురేందర్‌రెడ్డి, మన్మోహన్ సార్డా, మసూద్, కమిటీ సభ్యులు బస్వరాజ్, జనార్దన్ రెడ్డి, సత్యనారాయణబూబ్, పసారం బస్వరాజ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్ అర్బన్: ఐటీఐ కోర్సులలో రెండో విడత ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని వికారాబాద్ కళాశాల ప్రిన్సిపల్, జిల్లా కన్వీనర్ నరేంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు ఐటీఐ కాలేజీల్లో చేరేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 14 నుంచి 31వ వరకు htt pr://iti.teanfana.gov.in వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 10, 8వ తరగతులు పాసైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాకు ఫోన్: 9177472488, 8555865421లో సంప్రదించాలని తెలిపారు.

16న కాళీమాత బోనాలు

తాండూరు టౌన్: పట్టణంలో ఆదివారం కాళికాదేవి బోనాలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి నరేందర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.16న ఉదయం 5గంటలకు సుప్రభాత సేవతో వేడుకలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ప్రభుత్వ స్థలాల వేలానికి విశేష స్పందన



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

అనంతగిరి: వికారాబాద్ పట్టణం అనంతగిరి సమీపంలోని బిల్లా దాఖలా వద్ద ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలాలకు సంబంధించి గురువారం ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన వేలం పాటకు అనూహ్య స్పందన లభించింది. ఈ వేలానికి 110 మంది హాజరయ్యారని ఆర్డీఓ విజయకుమారి తెలిపారు. 15 ఎకరాలను 22 ప్లాట్లుగా విభజించి వేలం నిర్వహించగా 21 ప్లాట్లకు వేలం పాట పాడారు. ఇందులో ఎకరా స్థలం అత్యధికంగా రూ.2.21 కోట్లు, అత్యల్పంగా రూ.81.10 లక్షలు పలికింది.

అనంతగిరులకు అచ్చేదిన్

'స్వదేశీ దర్శన్'కు ఎంపిక

- కేంద్ర, రాష్ట్ర నిధులతో టూరిజం అభివృద్ధి
- మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు ఎల్‌అండ్‌టీకి బాధ్యతలు
- రూ.70 కోట్ల అంచనా వ్యయంతో డెవలప్‌మెంట్
- అడ్వెంచర్ టూరిజం, వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటుపై చర్చలు
- 500 నుంచి 1,000 మంది వరకు ఉపాధి అవకాశాలు



వికారాబాద్‌లోని అనంతగిరి పద్మనాభస్వామి ఆలయం

వికారాబాద్: అనంతగిరి కొండలు ఇక పర్యాటక హబ్‌గా మారనున్నాయి. ఇప్పటికే నిత్యం పర్యాటకులతో కిక్కిరిసిపోయే అనంతగిరిని టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. స్వదేశీ దర్శన్ పేరుతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకంలో భాగంగా ఇప్పటికే మొదటి విడతలో ఆయా రాష్ట్రాల్లోని పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేయగా.. ప్రస్తుతం అనంతగిరిని ఎంపిక చేశారు. తెలంగాణలో మొత్తం రెండు ప్రదేశాలను ఎంపిక చేయగా ఇందులో ఒకటి అనంతగిరి కాగా రెండోది భువనగిరి కొండ.

22వరకు మాస్టర్ ప్లాన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి భాగస్వామ్యంతో టూరిజం(పర్యాటకం)అభివృద్ధి చేయనున్నారు. ఇప్పటికే కలెక్టర్ ఆధ్వర్యంలో సమావేశమైన అధికారుల బృందం మాస్టర్ ప్లాన్,ప్రాజెక్టు తయారీ బాధ్యతలను ఎల్‌అండ్‌టీ సంస్థకు అప్పగించారు. ఈ నెల 22 వరకు ప్లాన్ తయారు చేసి ప్రభుత్వానికి సబ్మిట్ చేయనున్నారు. అనంతరం ప్రాజెక్టుకు టెండర్లు పిలిచి, పర్యాటక కేంద్ర అభివృద్ధి పనులు ప్రారంభిస్తారు.ఇది పూర్తయితే వికారాబాద్ జిల్లా కేంద్రానికి పర్యాటక శోభనివ్వడంతో పాటు ఈ ప్రాంత వాసులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి.

రూ.70 కోట్లతో పనులు

పర్యాటక కేంద్రాల్లో రెండు రకాల అభివృద్ధి పనులు చేపడుతారు.ఇందులో ఒకటి సాధారణ అభివృద్ధి.. ఇందులో భాగంగా అడవుల అందాలను వీక్షించడం ,ఆలయాల సందర్శన తదితర అంశాలు ఉంటాయి. రెండోది అడ్వెంచర్ టూరిజం(సాహస పర్యాటకం) అభివృద్ధి.. ఇందులో ప్రధానంగా యువత ఇష్టపడే సాహస కృత్యాలకు దోహదపడేలా టూరిజాన్ని డెవలప్ చేస్తారు. ట్రెక్కింగ్, రోప్‌వేలు తదితర అంశాలను అభివృద్ధి చేస్తారు. జిల్లా కేంద్రమైన వికారాబాద్‌కు సమీపంలో ఉన్న అనంతగిరుల్లో ఈ రెండు రకాల కార్యక్రమాలను కలగలపి టూరిజం అభివృద్ధి చేసేలా ప్లాన్ చేస్తున్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.70 కోట్లు ఖర్చవుతుందని ప్రాథమికంగా అంచనా వేయగా అవసరం మేరకు ఫండ్స్ పెంచనున్నట్లు అధికారులు చెబుతున్నారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న ఈ ప్రదేశం ఇప్పటికే పర్యాటక కేంద్రంగా పేరు సంపాదించింది. ప్రస్తుతం స్వదేశీ దర్శన్ పథకంలో భాగంగా మరింత ఆకర్షణీయంగా రూపుదిద్దుకోనుంది. ఇందులో భాగంగా ఎకో పార్క్, కన్వెన్షన్ హాళ్లు, ట్రెక్కింగ్, రోప్‌వేస్, హోటల్స్, ఆలయ అభివృద్ధి, వ్యూ పాయింట్ డెవలప్‌మెంట్, పార్కులు, గార్డెన్ల అభివృద్ధి, ఈటింగ్ హాల్స్, పక్షులు, జంతువుల వీక్షణ తదితర అభివృద్ధి కార్యక్రమాలు 213 ఎకరాల్లో స్వదేశీదర్శన్ పనులు చేపట్టనున్నారు. ప్రాజెక్టు పూర్తయితే 500 నుంచి 1,000 మంది వరకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించనుంది.

అనేక అనుకూలతలు...

జిల్లా కేంద్రానికి అత్యంత సమీపంలో ఉన్న అనంతగిరి గుట్టను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు అనేక సానుకూల అంశాలున్నాయి. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు 70 కిలోమీటర్ల దూరంలో ఈ ప్రాంతం ఉంది. రోడ్డు విస్తరణ పనులు పూర్తయితే నగరం నుంచి కేవలం గంటలో ఇక్కడకు చేరుకునే అవకాశం ఉంటుంది. బెంగళూరు, ముంబై హైవేల నుంచి కూడా గంటలోపే ఇక్కడికి చేరుకోవచ్చు. దట్టమైన అరణ్యం, ఎత్తయిన కొండలు, రోడ్డులో అందమైన మలుపులు, గుట్టపై చారిత్రాత్మకమైన అనంతపద్మనాభ స్వామి ఆలయం, ట్రెక్కింగ్ స్పాట్లు, అనేక రకాల పక్షి, జంతు జాతులు అనంతగిరి అడవిలో ఉన్నాయి. తెలంగాణ టూరిజం శాఖ నిర్మించిన కాటేజీలు, పక్కనే కోట్‌పల్లి ప్రాజెక్టు, అందులో బోటింగ్ ఇలా అనేక రకాలుగా అనంతగిరికి పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు అనుకూలత అంశాలు ఉన్నాయి. ఇప్పటికే ప్రతి నిత్యం వందల సంఖ్యలో, వీకెండ్స్‌లో వేల సంఖ్యలో పర్యాటకులతో కిటకిటలాడే అనంతగిరులు స్వదేశీ దర్శన్ ప్రాజెక్టులో ఎంపికైన నేపథ్యంలో టూరిజం హబ్‌గా మారనుంది.

జిల్లాకు తలమానికం



ఇప్పటికే అనేక సానుకూలతలతో టూరిజం స్పాట్‌గా మారిన అనంతగిరి స్వదేశీ దర్శన్‌కు ఎంపిక కావడం శుభపరిణామం. ఇది నిజంగా జిల్లా వాసులకు వరం లాంటిదే. దీంతో జిల్లాకు గుర్తింపు రావడమే కాకుండా ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి. ఇప్పటికే ప్రాజెక్టు విషయంలో సమీక్ష నిర్వహించి డీపీఆర్(డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్) మరియు మాస్టర్ ప్లాన్ తయారు చేసేందుకు ఎల్‌అండ్‌టీ సంస్థకు బాధ్యతలు అప్పగించాం. ఫారెస్టు, టూరిజం తదితర శాఖల సమన్వయంతో పని చేసి కార్యక్రమ నిర్వహణకు సహకరించాలి. ఒక రకంగా చెప్పాలంటే ఈ ప్రాజెక్టు పూర్తయితే జిల్లాకే తలమానికంగా నిలవనుంది.

– నారాయణరెడ్డి, కలెక్టర్, వికారాబాద్

యాగాలు పరిసమాప్తం

- దేవతల కటాక్షంతోనే పూర్ణాహుతిలో మంటలు
- తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు: పూర్వజన్మ సుకృతం వల్లే 11 రోజుల పాటు నిర్వహించిన యాగం ఎలాంటి ఆటంకం లేకుండా ముగిసిందని తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. గురువారం వేద పండితులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. తాండూరు ప్రజలు సుభిక్షంగా, సుఖసంతోషాలతో ఉండాలని ఈ నెల 3న ప్రారంభించిన శ్రీ రాజశ్యామల, శతచండీ, సౌర, లక్ష్మీ సుదర్శన సహిత అతిరుద్ర యాగాలు గురువారం సమాప్తమయ్యాయని ప్రకటించారు. గురువారం చివరి రోజు కావడంతో మహా పూర్ణాహుతి నిర్వహించామని,యాగాల్లో ఉపయోగించిన సామగ్రినిఅగ్నికి ఆహుతివ్వడం సంప్రదాయంగా వస్తున్న ఆచారమని తెలిపారు. అయితే ఒక్కోసారి దేవతల కరుణా కటాక్షాలతో యాగశాల అగ్నికి ఆహుతి అవుతుందని పురాణాలు చెబుతున్నట్లు వెల్లడించారు. ప్రధాన యాగశాలలో పూర్ణాహుతికి సిద్ధం చేస్తున్న సమయంలోనే మంటలు అంటుకుని వ్యాప్తి చెందాయని తెలిపారు. ప్రధాన యాగశాల అగ్నికి ఆహుతి కావడంపై పలువురు జగద్గురువులతో మాట్లాడానని, యాగ క్రతువులు పూర్తయ్యాక పూర్ణాహుతిలో మంటలు వ్యాపిస్తే దేవుళ్ల ఆశీస్సులు పుష్టిగా ఉంటాయని చెప్పారన్నారు. ఈ విషయం తెలియక కొంతమంది యాగంలో అపశ్రుతి జరిగిందని సోషల్ మీడియాలో ప్రచారం చేశారని తెలిపారు.11 రోజుల పాటు జరిగిన యాగాలలో 12 వేల మంది పుణ్య దంపతులతో పాటు వారి కుటుంబ సభ్యులు వేలాదిగా తరలివచ్చి సామూహిక యాగాల్లో పాల్గొన్నారని సంతోషం వ్యక్తం చేశారు. ఇందుకు సహకరించిన తాండూరు బ్రా హ్మణ సమాజంతో పాటు వీరశైవ, ఆర్యవైశ్య సమాజం సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

ప్రధాన యాగశాలకు మంటలు

ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి 11 రోజులుగా నిర్వహించిన యాగాలకు సంబంధించిన ప్రధాన యాగశాల అగ్నికి ఆహుతైంది. గురువారం చివరి రోజు కావడంతో ఉదయం 10.10 గంటలకు పూర్ణాహుతి కార్యక్రమానికి వేద పండితులు ముహూర్తం ఖరారు చేశారు. అంతకు ముందే ఎమ్మెల్యే సొంత స్థలంలో ఏర్పాటు చేసిన ప్రధాన యాగశాల పైకప్పునకు మంటలు ఎగిసి పడ్డాయి. హోమగుండాల వద్ద సుమారు 25 మంది వేద పండితులు పూజలు చేస్తున్నారు. ప్రధాన యాగశాలకు మంటలు అంటుకున్న విషయం గమనించిన పండితులు దేవత మూర్తుల విగ్రహాలతో యాగశాల నుంచి బయటకు వచ్చారు.పలువురి పండితుల ఫో న్లతో పాటు ఖరీదైన వస్తువులు అగ్నికి ఆహుతైనట్లు సమాచారం. నిమిషాల వ్యవధిలో మంటలు వ్యాపించి, పెద్దఎత్తున ఎగిసిపడ్డాయి. వీటిని ఆర్పేందుకు పోలీసులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఫైరింజన్లు చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చాయి. మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ కుటుంబ సమేతంగా యాగాల్లో పాల్గొన్నారు.



ప్రధాన యాగ మండపంలో ఎగిసి పడుతున్న మంటలు



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి

బీజేపీకి అధికారం ఖాయం

- కేసీఆర్ పాలనపై రాష్ట్ర ప్రజలు విసుగెత్తి ఉన్నారు
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి
- ప్రధాని, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపు

కొడంగల్ రూరల్: తెలంగాణలో బీజేపీ అధికారం ఖాయమని, ఇందుకోసం ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ మహాజన్ సంపర్క్ అభియాన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం తొమ్మిదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధాని మోదీ సుపరిపాలన, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇందుకోసం ప్రతీ కార్యకర్త గడపగడపకు, ఇంటింటికీ వెళ్లాలని కోరారు. కేసీఆర్ పాలనతో రాష్ట్ర ప్రజలు విసుగు చెంది ఉన్నారని, ప్రస్తుతం అందరి చూపు బీజేపీ వైపే ఉందని స్పష్టంచేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు, పనులు, నిధులతో కూడిన వివరాలతో ముద్రించిన కరపత్రాలను పంచుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కుంద్రు నర్సింలు, నారాయణపేట జిల్లా ఉపాధ్యక్షుడు మదన్, సీనియర్ నాయకులు పున్నంచంద్ లాహోటీ, రాష్ట్ర ట్రైనింగ్ సెల్ కో కన్వీనర్, జిల్లా కార్యదర్శులు బాబయ్యనాయుడు, కె.చంద్రప్ప, నాయకులు కోటకొండ రాము, పాండురంగం, సీహెచ్.నర్సిములు, బందెప్ప, సతీష్, శ్రీకాంత్, రాములు, మోహన్ రావు, సిబి.వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

అధిక జనాభాతో అనర్థాలే

- ప్రతిఒక్కరూ కుటుంబ నియంత్రణ పాటించాలి
- డీఎంహెచ్‌ఓ డాక్టర్ పాల్వాన్‌కుమార్



ప్రశంసా పత్రాలు అందుకున్న వైద్యారోగ్య శాఖ సిబ్బంది

వికారాబాద్ అర్బన్: ప్రపంచ జనాభా రోజురోజుకూ పెరిగిపోతున్న నేపథ్యంలో ప్రతిఒక్కరూ కుటుంబ నియంత్రణ పాటించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ పాల్వాన్ కుమార్ అన్నారు. గురువారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'కుటుంబ నియంత్రణ పాటించు.. జగతికి నూతన ఆధ్యాయం లిఖించు' అనే నినాదంతో ఈఏడాది ముందుకు సాగాలన్నారు. జనాభా పెరుగుదలతో రానున్న రోజుల్లో వనరుల కొరత ఏర్పడే ప్రమాదం ఉందని తెలిపారు. జన్మించిన వారికి ఆరోగ్యకరమైన వాతావరణం అందించడంతో పాటు నాణ్యమైన ఆహారం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. జనాభా పెరగడంతో భూమిపై అనేక అనర్థాలు ఎదురవుతాయని స్పష్టం చేశారు. అనంతరం ఒకే సంతానానికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసుకున్న ఎస్.అనిత, ఒకే బిడ్డ ఉండి ఐయూడీ వేయించుకున్న గుల్ల వెంకటమ్మ, వేసెక్టమీ ఆపరేషన్ చేసుకున్న శ్రీనివాస్, అంతర ఇంజక్షన్ వేయించుకున్న అలివేలుకు రూ.వెయ్యి చొప్పున నగదు ప్రోత్సాహకాలు, ప్రశంస పత్రాలు అందజేశారు. ఉత్తమ సేవలు అందించిన ఆరోగ్య కార్యకర్త వెంకాయమ్మ, స్టాఫ్‌నర్స్ ఎస్. భారతమ్మకు ప్రశంసాపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ జీవరాజ్, డాక్టర్ పవిత్ర, డాక్టర్ సాయిబాబ పాల్గొన్నారు.

రైతులపై ఎందుకంత వివక్ష?



కొడంగల్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే తదితరులు



పరిగి: రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

- రేవంత్ వ్యాఖ్యలపై బీఆర్‌ఎస్ నేతల మండిపాటు
- కేసీఆర్ హయాంలోనే రైతులు అభివృద్ధి చెందుతున్నారని వెల్లడి
- కాంగ్రెస్‌ను నమ్మే పరిస్థితి లేదని వెల్లడి
- పలుచోట్ల రేవంత్ దిష్టిబొమ్మల దహనం
- పాల్గొన్న కొడంగల్, పరిగి ఎమ్మెల్యేలు

కొడంగల్/పరిగి: కొడంగల్‌పై రేవంత్‌రెడ్డి కపట ప్రేమ చూపుతున్నారని ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి అన్నారు. ఆయనతో నియోజకవర్గానికి ఒరిగిందేమీ లేదని విమర్శించారు. గురువారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో రేవంత్ దిష్టి బొమ్మను దహనం చేశారు. రైతులకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉచిత కరెంటు ఇవ్వడంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం విడ్డూరమన్నారు. దీన్ని నిరసిస్తూ జాతీయ రహదారిపై బైఠాయించారు. రైతుల అభివృద్ధిపై కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. సీఎం కేసీఆర్ ప్రజలు మెచ్చిన పాలన చేస్తున్నారని, ఇది ఓర్వలేని కాంగ్రెస్ నేతలు అనవసర ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. కొడంగల్ ప్రజలు రేవంత్‌ను నమ్మే పరిస్థితి లేదని తెలిపారు. తొమ్మిదేళ్లు ఎమ్మెల్యేగా పనిచేసిన ఆయన ఓటమి తర్వాత కొడంగల్ ప్రజలను ఒక్క రోజు కూడా పలకరించిన పాపాన పోలేదని విమర్శించారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాతే నియోజకవర్గంలో అభివృద్ధి జరిగిందన్నారు. ప్రతీ గ్రామం పురోగతి వైపు అడుగులు వేసిందన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ అవసరం లేదని రేవంత్ అనడం ఆయన అవివేకానికి నిదర్శనమని తెలిపారు. మూడు గంటల కరెంట్‌తో రైతులు ఏంచేస్తారని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ వచ్చిన తర్వాత ఉచిత కరెంటు, రైతు బీమా, రైతుబంధు, ఆసరా పింఛన్లు, కేసీఆర్ కిట్టు, కల్యాణలక్ష్మి,, షాదీముబారక్ వంటి పథకాలను ప్రవేశపెట్టి అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేసిందని వివరించారు. ఈ కార్యక్రమంలో కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండలాల నుంచి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కొడంగల్ మెయిన్ రోడ్డుపై ఊరేగింపు నిర్వహించి రేవంత్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

మోసం చేసేందుకే..

రైతులపై రేవంత్‌రెడ్డికి అంత వివక్ష ఎందుకని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి ప్రశ్నించారు. గురువారం బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి పరిగిలో రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించి, బస్టాండ్ వద్ద దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నిలువునా మోసం చేస్తుందని చెప్పడానికి రేవంత్ వ్యాఖ్యలే నిదర్శనమని మండిపడ్డారు. వ్యవసాయానికి మూడు గంటల విద్యుత్ చాలన్న ఆయన మాటలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల సంక్షేమానికి సీఎం కేసీఆర్, బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంతగానో కృషిచేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, ఎంపీపీ అరవింద్‌రావు, జెడ్పీటీసీ హరిప్రియ, పీఏసీఎస్ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్ రాజేందర్, మండల అధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు రవికుమార్, తాహేర్, సంతోష్ పాల్గొన్నారు.

ఎలక్షన్ ఆర్‌ఓల నియామకం

- కొనసాగుతున్న పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్
- వికారాబాద్ ఆర్‌ఓగా అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ
- పరిగి బాధ్యతలు వికారాబాద్ ఆర్డీఓ విజయకుమారికి అప్పగింత
- కొడంగల్ ఆర్‌ఓగా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ నియామకం



రాహుల్‌శర్మ, వికారాబాద్ ఆర్‌ఓ



విజయకుమారి, పరిగి ఆర్‌ఓ



లింగ్యానాయక్, కొడంగల్ ఆర్‌ఓ

వికారాబాద్: ఎన్నికల కసరత్తు మరింత వేగవంతమైంది. ఇప్పటికే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రక్రియను ముమ్మరం చేసిన అధికారులు ఆర్‌ఓ(ఎన్నికల రిటర్నింగ్ అధికారులు)లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు ఆర్‌ఓలుగా ఎవరిని నియమించాలనే విషయంలో కలెక్టర్ ప్రపోజల్స్ పంపగా గురువారం కేంద్ర ఎన్నికల ముఖ్య కార్యదర్శి అవినాశ్‌కుమార్ ఆర్‌ఓలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గత రెండు మూడు నెలలుగా ఓటరు జాబితా ప్రక్షాళనపై దృష్టి సారిస్తూ వస్తున్న స్థానిక యంత్రాంగం జిల్లాకు అవసరమైన ఈవీఎంలను సమకూర్చుకోవటంతో పాటు పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ కార్యక్రమాలను చురుగ్గా కొనసాగిస్తున్నారు. సెక్టోరియల్ అధికారుల నియామకంపై మూడు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

జిల్లాలో ఆర్‌ఓలు వీరే....

ఎన్నికల కసరత్తు ఇప్పటికే ప్రారంభం కాగా ఆర్‌ఓల నియామకం జరగకపోవటంతో ఇప్పటి వరకు అన్ని కలెక్టర్ నారాయణరెడ్డి నేరుగా పర్యవేక్షిస్తున్నారు. వికారాబాద్ రిటర్నింగ్ అధికారిగా జిల్లాలో స్థానిక సంస్థల బాధ్యతలు నిర్వహిస్తున్న అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మను, పరిగి రిటర్నింగ్ అధికారిగా వికారాబాద్ ఆర్డీఓ విజయకుమారిని, కొడగంల్‌కు అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) లింగ్యానాయక్‌ను నియమించారు. ప్రస్తుతం తాండూరు ఆర్‌డీఓ లేకపోవడంతో ఈ పదవిలో ఎవరిని కేటాయిస్తే నియమిస్తే వారే ఆర్‌ఓగా ఉంటారు.

క్లుప్తంగా

ఫీల్డ్ అసిస్టెంట్‌ను విధుల నుంచి తొలగించండి

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన గ్రామస్తులు



ఫీల్డ్‌అసిస్టెంట్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

పరిగి: విద్యుత్ సరఫరాపై పీసీసీ చీఫ్ వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మలను దహనం చేయాలని పిలుపునిచ్చింది. దీంతో బుధవారం మండల పరిధిలోని మిట్టకోడూర్‌లో బీఆర్ఎస్ నాయకులు, ఫీల్డ్ అసిస్టెంట్ మల్లయ్య నినాదాలు చేస్తూ దిష్టిబొమ్మను దహనం చేశారు. దీంతో గురువారం గ్రామస్తులు దిష్టిబొమ్మను దహనం చేసిన ఫీల్డ్‌అసిస్టెంట్‌ను విధుల నుంచి తొలగించాలని కలెక్టర్ నారాయణరెడ్డికి ఫిర్యాదు చేశారు. పార్టీలకు అతీతంగా ఉండాల్సిన ఫీల్డ్‌అసిస్టెంట్ అధికార పార్టీకి కొమ్ముకాయడం ఎంత వరకు సమంజసమన్నారు. వెంటనే ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాస్, నర్సింహులు, రమేశ్, రషీద్ పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన

బంట్వారం: కోట్‌పల్లి మండలం నాగాసన్‌పల్లి, నాగసాన్‌పల్లి తండాలో గురువారం ఈవీఎంలపై డీటీ భరత్‌గౌడ్ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్‌లపై వివరించారు. ఈవీఎంల పై ప్రజలకు ఏమైనా సందేహాలు ఉంటే అక్కడికక్కడే నివృత్తి చేస్తామన్నారు. ఈ నెల 18వ తేదీ వరకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు.

రైతులూ.. దరఖాస్తు చేసుకోండి

యాలాల: రైతు బీమా పథకంలో అర్హత పొందేందుకు సకాలంలో దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి యాదగిరి కోరారు. ఈ ఏడాది జూన్ 18 వరకు ధరణి పోర్టల్‌లో డిజిటల్ పట్టా పాసు పుస్తకం పొందిన రైతులు, ఆర్ఓఎఫ్ఆర్ రైతులు రైతుబీమాకు అర్హులన్నారు. ఈ అవకాశం ఆగస్టు 5వ తేదీ వరకు ఉందని, రైతులు వినియోగించుకోవాలని సూచించారు.

ప్రతిఒక్కరూ ఓటు వేయాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

కుల్కచర్ల: ప్రతిఒక్కరూ ఓటింగ్ సరళిపై అవగాహన కలిగి ఉండాలని రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు అన్నారు. గురువారం కుల్కచర్ల మండలం చెల్లాపూర్, సాల్వీడు గ్రామాల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లలో ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో జరగనున్న ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాల్వీడు సర్పంచ్ బాలయ్య, ఆయా గ్రామాల కార్యదర్శులు, స్థానిక రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకు వైద్యం అందిస్తాం

- పల్లె ప్రజల ఆరోగ్యమే ముఖ్యం: ఎంపీ రంజిత్‌రెడ్డి
- నాగసమందర్‌లో ఆరోగ్య రథం ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే ఆనంద్ తదితరులు

ధారూరు: ఆరోగ్య రథాన్ని గడప గడపకు తీసుకెళ్లి వైద్యం అందిస్తామని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి తెలిపారు. వైద్య పరీక్షలు ప్రతి ఒక్కరూ చేయించుకోవాలనీ, మందులన్నీ ఉచితంగా మీ ఇంటి వద్దకే పంపిస్తామని అన్నారు. మండల పరిధిలోని నాగసమందర్ గ్రామంలో ఎమ్మెల్యే ఆనంద్‌తో కలిసి ఆరోగ్య రథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఇది ఎన్నికలను ఉద్దేశించి కాదని, కేవలం పల్లె ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించాలన్న ధ్యేయంతో చేస్తున్నట్లు చెప్పారు. ఒక్క బస్సుతోనే ఆరోగ్య రథం మొదలు పెట్టామని, మరో బస్సును కూడా ఏర్పాటు చేస్తామన్నారు. జీవితంలో మొట్టమొదటిది ఆరోగ్యమని, దానిని కాపాడుకుంటే అదే లక్షలు సంపాదించినట్లేనని అన్నారు. ఆరోగ్య రథంలో వైద్య సిబ్బందికి మూత్రం, రక్త నమూనాలు ఇస్తే వైద్య పరీక్షలు చేసి జబ్బులు ఉన్న వారిని గుర్తించి మందులు ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. రక్తపోటు, మధుమేహం ప్రమాదకరమైన జబ్బులని, తప్పనిసరిగా పరీక్షలు చేయించుకుని క్రమం తప్పకుండా మందులు వాడాలనీ ఆయన సూచించారు.

ఆరోగ్యంపై అశ్రద్ధ వద్దు: ఎమ్మెల్యే ఆనంద్


ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ మాట్లాడుతూ పని వత్తిడితో ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయవద్దని సూచించారు. బీపీ ఉన్నా పరీక్షలు చేయించుకోవడం లేదని, రోగం బలపడ్డాక ఆస్పత్రికి వెళ్లి ఎక్కువ డబ్బులు వ్యయం చేస్తున్నారని అన్నారు. రోగం నిర్ధారణ కావాలంటే వైద్య పరీక్షలు తప్పనిసరి అన్నారు. దీని వల్ల సరియైన వైద్యం చేయడానికి వీలవుతుందని అన్నారు. స్త్రీలో ఎక్కువగా రొమ్ము క్యాన్సర్ వస్తుందని, వాటికి మందులు ఉండవనే అపోహ వీడాలనీ ఆయన సూచించారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

గ్రామంలో ఆరుగురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు ఎంపీ, ఎమ్మెల్యేలు అందజేశారు. మోమిన్‌కలాన్ గ్రామంలో ప్రమాదవశాత్తు మృతి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త యాదగిరి కుటుంబానికి రూ. 2 లక్షల ప్రమాదబీమా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సర్పంచు చంద్రకళ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజునాయక్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పవిత్రోత్సవాలు ప్రారంభం

కొడంగల్ రూరల్ : పేదల తిరుపతిగా పేరుగాంచిన స్థానిక మహాలక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించే పవిత్రోత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. లోక కల్యాణం కోసం ఉద్దేశించిన పవిత్రోత్సవాలను తిరుమల తిరుపతి దేవస్థానం ప్రధాన అర్చకులు అర్చకం పెద్దింటి శ్రీనివాస దీక్షితులు, అర్చకం పెద్దింటి రవిశ్చంద్ర దీక్షితుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం 9గంటలకు శతకలశ తిరుమంజనం నిర్వహించారు. ఈ సందర్భంగా 108 వెండి కలశాలకు పూజలు చేశారు. అనంతరం పద్మావతి సమేత మహాలక్ష్మి వేంకటేశ్వర స్వామివారి మూలవిరాట్‌లకు సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. అనంతరం తిరుమల దేవస్థానం నుంచి ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. పవిత్ర ప్రతిష్ట చేసి స్వామివారికి విశేష పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దంపతులు ఈ యజ్ఞంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి కార్యక్రమాల్లో పాల్గొంటూ స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ఉత్సవ విగ్రహాలకు అభిషేకం చేస్తున్న అర్చకులు



స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

'ఉపాధి' సిబ్బందికి పే స్కేల్ అమలు చేయండి



మంత్రి దయాకర్‌రావును కలిసిన ఉపాధి హామీ సిబ్బంది

అనంతగిరి: ఉపాధి హామీలో పని చేస్తున్న తమకు పే స్కేల్ ఇవ్వాలని ఉపాధి హామీ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర నాయకులు గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును కోరారు. ఈ మేరకు గురువారం ఉదయం రాష్ట్ర నాయకుల బృందం మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు నవీన్ కుమార్ మాట్లాడుతూ ఉపాధి హామీ సిబ్బంది వివిధ రకాలైన శాఖలతో సమన్వయం చేసుకుంటూ పని చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్లను ఎప్పటికప్పుడు పూర్తి చేస్తున్నామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సానుకూలంగా వివరించి సమస్యలను పరిష్కరించాలని మంత్రిని కోరారు ఈ కార్యక్రమంలో పలుగులు రాష్ట్ర ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

ధారూరు: తాండూరు నుంచి గంజాయి తరలిస్తున్న వ్యక్తి పోలీసులకు పట్టుబడిన ఘటన చోటుచేసుకుంది. ధారూరు సర్కిల్ సీఐ రామకృష్ణ గురువారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బీహార్ రాష్ట్రానికి చెందిన కుమార్ అనే వ్యక్తి తాండూరు నుంచి ధారూరు మండల కేంద్రంలో విక్రయించడానికి బుధవారం సాయంత్రం కిలో గంజాయిని తీసుకువస్తున్నారు. ధారూరు చౌరస్తాలో ఎస్ఐ సంతోష్ కుమార్, సిబ్బంది వాహనాలను తనిఖీ చేస్తుండగా కుమార్ ఆటోలోంచి దిగి పారిపోవడం గమనించారు. వెంటనే పోలీసులు అతనిని వెంబడించి పట్టుకున్నారు. అతని వద్ద కిలో గంజాయి సంచి దొరకడంతో అరెస్టు చేసి పీఎస్‌కు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడంలో జాప్యం తగదు

కొడంగల్ రూరల్: కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు, ఎల్‌టీ లైన్ల కోసం రైతులు డీడీలు కట్టినా విద్యుత్ కనెక్షన్ ఇవ్వడంలో అధికారులు జాప్యం చేస్తున్నారని దళిత బహుజన శ్రామిక యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగంసాయిలు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రైతులు నాట్లు వేసే సమయం గడుస్తున్నా అధికారులు కనెక్షన్ ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

జర్నలిస్టు పిల్లలకు ఫీజులో 50 శాతం రాయితీ

అనంతగిరి: జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో 50 శాతం ఫీజు రాయితీతో విద్య అందించాలని విద్యాశాఖ అధికారి రేణుకా దేవి ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల జర్నలిస్టులు ఫీజు విషయాన్ని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు ప్రైవేట్ పాఠశాలల్లో 50 శాతం రాయితీతో జర్నలిస్టు పిల్లలకు విద్యను అందించాలని డీఈఓ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు గురువారం టీయూడబ్ల్యూ ఐజేయూ జిల్లా ప్రధాన కారదర్శి కొత్తపల్లి శ్రీధర్, చుక్కయ్యలు ప్రొసిడింగ్ ఆర్డర్ ను అందుకున్నారు.

అదనపు కలెక్టర్‌ను కలిసిన నాయకులు



అదనపు కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

అనంతగిరి: అదనపు కలెక్టర్‌గా ఇటీవలే బాధ్యతలు చేపట్టిన లింగ్యా నాయక్ ను గురువారం ఆల్ ఇండియా ట్రైబల్ ఫెడరేషన్ (ఏఐటీఎఫ్) స్టేట్ అధ్యక్షుడు రాఘవన్ నాయక్, డీటీఓ దశరథ్ , ట్రైబల్ వెల్ఫేర్ జిల్లా అధికారి కోటజీ తో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ విజయ్ కుమార్, కౌన్సిలర్ చందర్ నాయక్ తదితరులు ఉన్నారు.

రేపటి నుంచి రూ.లక్ష సాయం



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్

వికారాబాద్ అర్బన్: అర్హులైన కులవృత్తిదారులకు శనివారం నుంచి రూ.లక్ష సాయం పంపిణీకి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. బీసీ కులవృత్తులు, చేతి వృత్తులవారికి సాయం అందజేతపై బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ వెంకటేశం కలెక్టర్లతో నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. జూలై మాసంలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 300 మంది చొప్పున లబ్ధిదారులకు రూ.లక్ష చెక్కులు అందజేస్తామని కలెక్టర్ తెలిపారు.

ఘనంగా బోనాలు



బోనాల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల తదితరులు

అనంతగిరి: వికారాబాద్ పట్టణం శివరాంనగర్ కాలనీలో గురువారం సాయంత్రం బోనాల పండుగ ఘనంగా జరిగింది. ఈ మేరకు మహిళలు పెద్ద ఎత్తున బోనాలతో తరలివచ్చి అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా పోతరాజుల విన్యాసాలతో ముందుకు సాగారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల, కౌన్సిలర్ గాయత్రిలక్ష్మణ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వారసత్వ భూములకు పట్టాలివ్వండి



తహసీల్దార్ రమేశ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ముజాహిద్‌పూర్ గ్రామస్తులు

కుల్కచర్ల: వారసత్వంగా తమకు వచ్చిన భూములకు పట్టాలు అందజేయాలని ముజాహిద్‌పూర్ గ్రామస్తులు కోరారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ రమేశ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తమ పెద్దలకాలం నుంచి సాగుచేసుకుంటున్న (ఇనాం)భూములను తమ పేర్లమీదకు మార్చాలన్నారు. వివిధ కారణాలు చూపుతూ సమస్యను నాన్చుతున్న అధికారుల తీరుతో తాము రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలకు దూరమవుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చంద్రభూపాల్, పడగళ్ల భాస్కర్, యాదయ్య, కిష్టయ్య, పెద్ద కిష్టయ్య, నర్సింహులు, చంద్రయ్య, రామయ్య, పోచమ్మ, సత్యమ్మ, కృష్ణ, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి



మోమిన్‌పేటలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

- బీఆర్ఎస్ నేత వెంకట్

మోమిన్‌పేట: రైతు వ్యతిరేకిగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్‌కు వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు డి.వెంకట్ అన్నారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి నిరంతర విద్యుత్ సరఫరా ఇస్తుండగా.. తెలంగాణ రైతాంగాన్ని ముంచేందుకు కాంగ్రెస్ కంకణం కట్టుకుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు మండల కో ఆర్డినేటర్ అజీజ్, నాయకులు మధుసూధన్‌రెడ్డి, మైపాల్, రవి, మైబల్లి, రాజు, అనంతయ్య, నర్సింలు, ప్రతాప్‌రెడ్డి ఉన్నారు.

అధైర్యపడొద్దు అండగా ఉంటాం



ఆస్పత్రి సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి

కుల్కచర్ల: నిరుపేద ప్రజలు, బీఆర్ఎస్ కార్యకర్తలకు తాము ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. చౌడాపూర్ మండలం మందిపల్‌కు చెందిన కుండలి అనంతయ్య అనారోగ్యం బారినపడి మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే స్వయంగా ఆసుపత్రికి వెళ్లి బాధిత వ్యక్తిని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట గండీడు జెడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, చౌడాపూర్ మండల నాయకులు మఠం రాజశేఖర్ పాల్గొన్నారు.

నేరస్తులు, రౌడీ షీటర్స్‌పై నిఘా

- శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టిసారించాలి
- ఎస్పీ కోటిరెడ్డి
- పోలీస్ అధికారులతో సమీక్ష



ఏఎస్పీ గా పదోన్నతి పొందిన సత్యనారాయణ ను సన్మానిస్తున్న ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: పాత నేరస్తులు, రౌడీ షీటర్స్‌పై ప్రత్యేకం నిఘా పెట్టాలని ఎస్పీ కోటిరెడ్డి పోలీసు అధికారులకు సూచించారు. ఈ మేరకు గురువారం ఎస్పీ కార్యాలయంలో పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసులను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నందునా ప్రతి ఒక్క పోలీస్ అధికారి అప్రమత్తంగా ఉండాలన్నారు. శాంతిభద్రతలపై దృష్టి సారించాలన్నారు. పీఎస్ పరిధిలోని పోలింగ్ స్టేషన్స్, పోలింగ్ లోకేషన్స్, ఎన్ని రూట్లు ఉన్నాయి సమస్యాత్మక గ్రామాలు తదితర వాటి ప్రతి సమాచారం కలిగి ఉండాలన్నారు. అనంతరం బదిలీ, ప్రమోషన్ల పై వెళ్లిన పలువురు పోలీసు అధికారులను ఎస్పీ సన్మానించారు. డీఎస్పీగా పనిచేసిన సత్యనారాయణ అదనపు ఎస్పీగా పదోన్నతి పొందడం తో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఎస్పీ శ్రీనివాసరావు, డీటీసీ ఏఎస్పీ మురళీధర్, పరిగి డీఎస్పీ కరుణ సాగర్ రెడ్డి, తాండూరు డీఎస్పీ శేఖర్ గౌడ్ జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు బాసట



నగదు అందజేస్తున్న సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మొగులయ్య

బొంరాస్‌పేట: భవననిర్మాణ కార్మికులకు అండగా ఉంటామని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మొగులయ్య అన్నారు. పరిగి మండలం రూప్‌ఖాన్‌పేట జోగు రమేశ్ (42) అనే భవననిర్మాణ కార్మికుడు తీవ్ర అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో మృతుని భార్యకు సంఘం నుంచి రూ.5వేల నగదును అంత్యక్రియలకు అందజేశారు. కార్యక్రమంలో కొడంగల్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు తూము రాములు, కోశాధికారి అంజి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అన్యాయం చేసే కుట్ర



నాగసమందర్ సబ్ స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టిన ఎంపీ, ఎమ్మెల్యే

- ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆనంద్
- నాగసమందర్‌లో రేవంత్ దిష్టిబొమ్మ దహనం

ధారూరు: రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా ధారూరు మండల పరిధిలోని నాగసమందర్ గ్రామ విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట గురవారం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. స్థానిక ఎమ్మెల్యే ఆనంద్‌తో కలిసి నిరసనలో పాల్గొన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి రైతులకు అన్యాయం చేసేందుకు కుట్ర చేస్తున్నాడని ఆరోపించారు. వెంటనే రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజునాయక్, మాజీ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, మండల రైతుబంధు కమిటీ అధ్యక్షుడు వెంకటయ్య, బీఆర్ఎస్ పార్టీ నాయకులు రవీందర్‌రెడ్డి, సంతోష్‌కుమార్, ఎ.అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

బోనాల పండుగకు ఏర్పాట్లు పూర్తి

కుల్కచర్ల: మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించనున్న బోనాల పండుగకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని సర్పంచ్ సౌమ్యారెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం పోచమ్మ ఆలయం వద్ద కొనసాగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని తెలిపారు.



ఆలయం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న సర్పంచ్ సౌమ్యారెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి

క్రీడలతో ఆరోగ్యం మెరుగు

- సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పర్వతాలు

మొయినాబాద్: క్రీడలతో ఆరోగ్యం మెరుగుపడుతోందని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు అన్నారు. రెండు నెలలుగా నిర్వహిస్తున్న ఎంపీఎల్ సీజన్–5 క్రికెట్ టోర్నమెంట్ గురువారం ముగిసింది. టోర్నమెంట్‌లో 12 జట్లు పాల్గొన్నాయి. మస్కట్ ఎలెవెన్, ఇమామ్ కన్‌స్ట్రక్షన్ జట్లు ఫైనల్‌కు చేరాయి. ఫైనల్ మ్యాచ్‌లో ఇమామ్ కన్‌స్ట్రక్షన్ జట్టు విజయం సాధించింది. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పర్వతాలు ముఖ్యఅతిథిగా హాజరై బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. ఇలాంటి టోర్నమెంట్లు క్రీడాకారుల ప్రతిభను పెంచుకోవడానికి ఉపయోగపడతాయని సూచించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు కిషన్‌రావు, జంగయ్య, చంటి తదితరులు పాల్గొన్నారు.